
సాక్షి ఒడిశా

సోమవారం । 24 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. నగదు రూ. 8,28,676 లు, బంగారం 8 గ్రాముల 150 మిల్లీ గ్రాములు, వెండి 145 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



బీఎస్ఎఫ్ క్యాంప్ ఏర్పాటు

- 8లో



నేత్రపర్వం.. చందనోత్సవం

- 8లో

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌లోకి బీజేడీ నాయకులు



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ సప్తగిరి

రాయగడ: జిల్లాల్లోని బిసంకటక్, మునిగుడ సమితులకు చెందిన పలువురు బీజేడీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేశారు. స్థానిక కాంగ్రెస్ భవనంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దుర్గా పండ అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎంపీ సప్తగిరి ఉలక సమక్షంలో వారంతా కాంగ్రెస్ కండువాలు వేసుకున్నారు. కాంగ్రెస్‌లో చేరినవారిలో మునిగుడకు చెందిన డొంబురుధర సతపతి, లొంబొదర పిడికాక, దాశరథి పిడికాక, తొయిసేస్ పిడికాక, బిసంకటక్‌కు చెందిన డొంబురుధర కైబొర తదితలు ఉన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మజ్జి శంకరరావు, జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అస్లామ్ ఖాన్‌లు పాల్గొన్నారు.

పిడుగు పడి ఒకరు మృతి



కొంభు ప్రధాని మృతదేహం

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి అంబొదల పోలీసుస్టేషన్ పరిధి తువాపడి గ్రామంలో శనివారం సాయంత్రం పిడుగు పడి ఒకరు మృతి చెందారు. మృతుడు కొంభు ప్రధాని(48)గా గుర్తించారు. సాయంత్రం బహిర్భూమి కోసం సమీపంలోని పొలంలోకి వెళ్లిన సమయంలో వర్షం రావడంతో అక్కడే ఉన్న చెట్టు కింద నిలబడ్డాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడడంతో కొంభు ప్రధాని కుప్పకూలిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చికిత్స కోసం వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ ఎక్సైజ్ సిబ్బంది 5 కేజీల గంజాయితో ఒక వ్యక్తిని ఆదివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బొరిగుమ్మ పోలీసుస్టేషన్ పరిధి హరడాపుట్ ప్రాంతంలో ఉదయం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో ఒక వ్యక్తి జయపురం–బొరిగుమ్మ మధ్య 26వ జాతీయ రహదారిపై అనుమానాస్పదంగా బ్యాగ్‌తో ఉండడంతో ప్రశ్నించారు. అనంతరం అతడి బ్యాగ్‌ను తనిఖీ చేయగా గంజాయి బయటపడినట్లు వెల్లడించారు. నిందితుడు బీహార్ రాష్ట్ర ఔరంగాబాద్‌కు చెందిన జయరాం శర్మగా గుర్తించారు. గంజాయి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్ద మనసు చాటుకున్న జవాన్లు



వాహనంలో మహిళను తరలిస్తున్న జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి జాంత్రీ వద్ద రోడ్డు పనులు కోసం తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన రేణుక అనే మహిళకు శనివారం సాయంత్రం గుండెపోటు వచ్చింది. దీంతో అక్కడే ఉన్న ఆమె భర్త, తోటి పనివారు ఆమెను సమీపంలో ఉన్న బీఎస్ఎఫ్ క్యాంప్ వద్దకు తీసుకెళ్లారు. ఆమెను పరీక్షించిన జవాన్లు ముందు నొప్పి తగడం కోసం చికిత్స చేశారు. అనంతరం వారి వాహనంలోనే జోడంభో వద్దనున్న ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. అనంతరం ఆమెను ఆదివారం చిత్రకొండ తీసుకొచ్చారు. దీంతో జవాన్ల పెద్ద మనసుకు ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలియజేశారు.



ప్రారంభమైన వ్యవసాయ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్

వైభవంగా అక్షయ తృతీయ

- రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ పనులకు శ్రీకారం
- ఏరు పూసిన సీఎం నవీన్ పట్నాయక్
- వ్యవసాయ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు



ఓయూఏటీ ప్రాంగణంలో సాగు పనులకు శ్రీకారం చుడుతున్న సీఎం నవీన్ పట్నాయక్



ఏరు పూస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా అక్షయ తృతీయ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం రైతు దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా స్థానిక ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీ (ఓయూఏటీ) వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన సీఎం నవీన్ పట్నాయక్ వరి పొలాల్లో విత్తనాలు విత్తడం, దుక్కి దున్నడం వంటి పనుల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు. స్థానికులు అభిముఠిగా వ్యవహరించే ఈ పనులను సీఎం ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది రైతులకు మంచి దిగుబడులు రావాలని ఆకాంక్షించారు.

వ్యవసాయ సమీక్ష కేంద్రం ప్రారంభం

అక్షయ తృతీయ శుభ సందర్భంగా సీఎం నవీన్ పట్నాయక్ భారతదేశపు మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ – కృషి (వ్యవసాయ) సమీక్ష కేంద్రాన్ని లోక్‌సేవా భవన్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. కృషి భవన్ ప్రాంగణంలోని వ్యవసాయ శాఖ యంత్రాంగాలను ఈ కేంద్రం పర్యవేక్షించి సమీక్షిస్తుంది. వాస్తవిక ఆధారాలతో నిర్ణయాత్మక కార్యాచరణ ఎప్పటికప్పుడు జారీ



లోక్‌సేవా భవన్ ప్రాంగణంలో ప్రారంభించిన కలికా క్రెచ్, మిల్లెట్ శక్తి కెఫే

చేస్తుంది. తరచూ రైతాంగం అనుబంధ వర్గాలతో చర్చలు, సంప్రదింపులు జరిపి వ్యవసాయం, సాగు నీరు వగైరా పథకాల అమలు, సద్వినియోగానికి తాజా ప్రణాళికలను క్షేత్రస్థాయి వర్గాలకు జారీ చేయడమే సమీక్ష కేంద్రం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ – రైతు సాధికారిత శాఖ ప్రధాన కార్యదర్శి అరవింద కుమార్ పాఢి వివరించారు.

మిల్లెట్ శక్తి కెఫే

లోక్‌సేవా భవన్ ప్రాంగణంలో ముఖ్యమంత్రి మిల్లెట్ శక్తి కెఫేను ప్రారంభించారు. పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడంలో రాగి (చోళ్లు), తృణ ఆహార ధాన్యాల ప్రాముఖ్యతను ప్రాచుర్య పరిచే దృక్పథంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిల్లెట్ మిషన్ ఆధీనంలో ఈ వ్యవస్థ పనిచేస్తుంది. మిల్లెట్ మిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పలుచోట్ల 142 మిల్లెట్ ఔట్‌లెట్లను ప్రారంభించారు.

పసిపిల్లల సంరక్షణకు క్రెచ్

లోక్‌సేవ భవన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లల కోసం ప్రత్యేక సంరక్షణ కేంద్రం కలికా క్రెచ్ ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ముఖ్యమంత్రి ఆదివారం ప్రారంభించారు. తొలి దశలో సమగ్రంగా 20 మంది పిల్లలకు వసతి కల్పిస్తారు. తొలుత వచ్చినవారికి తొలి అవకాశం ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. ఇతర నిబంధనలు, షరతులు వర్తింపజేస్తారు. అక్షయ తృతీయ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు రాష్ట్రస్థాయి కార్యక్రమాల్లో వ్యవసాయ, రైతు సాధికారత మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వంయి, మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి బాసంతి హేంబ్రామ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా, అభివృద్ధి కమిషనర్ అనుగర్గ్, మిషన్ శక్తి కార్యదర్శి సుజాత కార్తికేయన్ పాండియన్, మహిళా శిశు అభివృద్ధి శాఖ కార్యదర్శి శుభా శర్మ తదితరులు పాల్గొన్నారు.

100 ఎకరాల్లో పైనాపిల్ పంట దగ్ధం



దగ్ధమైన పైనాపిల్ పంటను చూపిస్తున్న రైతులు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి నియమగిరి పర్వత ప్రాంతాల్లో ఉన్న కుర్లి పంచాయతీలోని కాంబేసు కొండపై మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతంలో పండిస్తున్న పైనాపిల్ పంట దగ్ధమయ్యింది. శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనలో సుమారు వంద ఎకరాల పైనాపిల్ పంటకు నష్టం వాటిల్లడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నియమగిరి పర్వత ప్రాంతాల్లో డొంగిరియా తెగకు చెందిన ఆదిమ జాతి ప్రజలు నివసిస్తుంటారు. వీరంతా పైనాపిల్, మామిడి, అరటి తదితర పంటలను సాగుచేస్తూ జీవిస్తుంటారు. ముఖ్యంగా కాంబేసు ప్రాంతంలో అత్యధిక శాతం మంది డొంగిరియాలు పైనాపిల్ పంట పండిస్తుంటారు. మరి కొద్దిరోజుల్లో పంట చేతికి అందుతుందన్న సమయంలో కార్చిచ్చు కారణంగా పంటంతా ధ్వంసమయ్యిందని వారంతా లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాల్సిందిగా కోరుతున్నారు. అయితే మంటలు చెలరేగడానికి కారణాలు తెలియడం లేదు.

అమ్మవారికి కాంస్య పాదాలు



కొత్తగా రూపొందించిన పాదాలు



అమ్మవారి పాదాలను తీసుకెళ్తున్న బిడిక తదితరులు

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారి ఆలయానికి సమీపంలోని పాదాల మందిరంలో అమ్మవారికి కొత్తగా కాంస్యంతో తయారు చేసిన పాదాలను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యుడు దేవేంద్ర కుమార్ బెహర, ఆలయ అర్చకుడు చక్రధర్ బెరుకొ, సుదర్శన్ బెరుకొలు అమ్మవారి ఆలయం నుంచి పాదాలు మోసుకుంటూ పాదాల మందిరానికి చేరుకొని, ప్రత్యేక పూజల అనంతరం అమర్చారు.

ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక ఓం శాంతి కాలనీ చిన్మయ మిషన్ వద్ద ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యాలయ భవనానికి ఆదివారం భూమిపూజ చేశారు. కేశవ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకుడు సమీర్‌కుమార్ మ హంతి, ప్రాంతీయ సంచాలకుడు భగవాన్ త్రిపాఠి, దేవీ మఠం మహంత రామానంద దాస్, మ నోజ్ దాస్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘరానా మోసం

- అద్దెకు తీసుకెళ్లిన రోలర్లు అమ్మివేత



స్వాధీనం చేసుకున్న నగదు



అరెస్టైన విక్కీ కుమార్

జయపురం: రైల్వే కాంట్రాక్టర్ ముసుగులో రోలర్లు అద్దెకు తీసుకొని, వాటిని అమ్మివేస్తున్న వ్యక్తి ఘరానా మోసం బయటపడినట్లు దివారం జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి ఆదివారం వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. హరియాణాకు చెందిన ఒక వ్యక్తి తనకు తాను శర్మగా అందరికీ పరిచయం చేసుకున్నాడు. తాను రైల్వే కాంట్రాక్టర్‌గా పనులు చేయిస్తుంటానని చెప్పి, పనులు చేసేందుకు రోడ్డు రోలర్లు అద్దెకు కావాలని కొరాపుట్ పూజారిపుట్‌లోని సంతోష్ కుమార్ గాఢ(37)కు తెలిపాడు. రోలర్‌కు నెలకు రూ.20 వేల అద్దెతో పాటు డ్రైవర్‌కు జీతం రూ.10 వేలు ఇస్తామని, 5 నెలల కోసం రోలర్లు అద్దెకు తీసుకుంటానని నమ్మించాడు. అనంతరం సంతోష్ కుమార్ సాయంతో ఆ కాంట్రాక్టర్ నవరంగపూర్‌లో జగన్నాథ్ మహాపాత్రో అనే వ్యక్తిని కలిసి, తనకు రెండు రోడ్డు రోలర్లు అద్దెకు కావాలని తెలియజేశాడు. అందుకు అంగీకరించిన మహాపాత్రో మధ్యవర్తి సంతోష్ కుమార్ గాఢపై నమ్మకంతో శర్మకు రోలర్లు ఇచ్చాడు. కంట్రాక్టర్ ఫోన్ నంబర్ తప్ప, అతడి వివరాలు రోలర్ యజమాని దగ్గర లేవు. దీంతో కొన్ని రోజుల తర్వాత ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. అతడి వివరాలు తెలుసుకునేందుకు ఎటువంటి అవకాశం లేకపోవడంతో సంతోష్ కుమార్ గాఢ, మహాపాత్రోలు రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. అక్కడ రోలర్లు లేకపోవడంతో మోసపోయామని గుర్తించారు. వెంటనే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించగా, గాంధీ కూడలి వద్దనున్న విక్కీ కుమార్‌కు రోలర్లు అమ్మినట్లు గుర్తించారు. అతడిని విచారించగా శర్మ అనే వ్యక్తి తనకు అమ్మినట్లు తెలియజేశాడు. అందులో ఒక రోలర్‌ను రాయపూర్‌కు చెందిన వ్యక్తికి ముక్కలుముక్కలుగా చేసి విక్కీ అమ్మివేశాడు. దీంతో అతడి నుంచి అమ్మిన డబ్బులు రూ.3.5 లక్షలు, మరో రోలర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అసలైన నిందితుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

• సైకత శుభాకాంక్షలు



పవిత్ర అక్షయ తృతీయ పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూరీ సాగర తీరంలో పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ ఆకర్షణీయమైన సైకత శిల్పం ఆవిష్కరించారు. ఈ శిల్పంలో అక్షయ తృతీయ సమగ్ర ఇతివృత్తాన్ని ప్రతిబింబింపజేయడం విశేషం. ప్రధానంగా జగన్నాథుని రథ తయారీ అంకురార్పణ ప్రక్రియని కళాత్మకంగా పొందుపరచి చూపరులను ఆకట్టుకున్నారు.

– భువనేశ్వర్

ఘోష యాత్ర ఆదిపర్వం ఆరంభం

- బంగారు గొడ్డలితో రథ కలప ఛేదన



రథ కలపకు జల శుద్ధి చేస్తున్న దృశ్యం



రథ తయారీ శాలకు స్వామివారి ఆజ్ఞామాల తరలింపు



ఆజ్ఞామాలతో రథ కలపకు పూజాదులు



రథ నిర్మాణ శాల ప్రాంగణంలో వన జాగరణ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్:

పూరీ జగన్నాథుని వార్షిక ఘోష యాత్ర ఆదిపర్వం అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. అక్షయ తృతీయ పురస్కరించుకొని యాత్రకు అవసరమైన 3 కొత్త రథాల నిర్మాణానికి అంకురార్పణ జరిపారు. శ్రీమందిరం కార్యాలయం ఆవరణలో ముందస్తుగా ఏర్పాటు చేసిన యజ్ఞశాలలో వన జాగరణ రీతులతో ప్రత్యేక హోమాదులు నిర్వహించారు. ఈ ప్రాంగణానికి జగన్నాథుని ఆజ్ఞకు సంకేతంగా భారీ పూలమాల చేరడంతో రథ నిర్మాణ అంకురార్పణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాంగణంలో ఒక్కో రథం నిర్మాణానికి ఒక్కో కలప దుంగ చొప్పున ముందుగా ఎంపిక చేసి సిద్ధం చేశారు. వీటికి పరిశుద్ధ జలంతో శుచిగా మలచి జగన్నాథుని సన్నిధి నుంచి తరలించిన వస్త్రంతో అలంకరించారు. నందిఘోష్, తాళధ్వజం, దర్ప దళనం రథాల కలపకు ఆజ్ఞామాలతో పూజాదులు నిర్వహించి అనుబంధ విశ్వకర్మ సేవకులు బంగారు గొడ్డలితో లాంఛనంగా కోత ప్రారంభించారు. దెవుళొ పురోహిత్, రాజ గురువు, వేద పండితులు శాస్త్రోక్తంగా వన జాగరణ ఇష్ట దేవత ఆది నృసింహునికి పూజాదులు నిర్వహించారు. ఈ పూజాదులను సాధారణ ప్రజానీకం ప్రత్యక్షంగా కనులారా తిలకించి తన్మయులయ్యారు.

రథ సంహిత ఆధారంగా..

రథ సంహిత ప్రకారం ఏటా సరస్వతీ పూజ (వసంత పంచమి) నాడు రథ కలప ప్రతిష్ట, శ్రీరామ నవమి నాడు కలప మిల్లులో రథ కలప లాంఛనంగా చీల్చడం, అక్షయ తృతీయ నాడు రథాల తయారీ ప్రక్రియకు అంకురార్పణ కార్యక్రమాలు చేపడతారు. భంవురి తిథి నాడు చక్రాలు సిద్ధం చేసి, శీతల షష్ఠి నాడు ఇరుసుకు అమర్చుతారు. నృసింహ చతుర్దశి నాడు రథాలపై నలువైపులా స్తంభాల అమరిక, స్నాన పూర్ణిమ నాడు రథాల పైఅంతస్తుల నిర్మాణం చేపడతారు. శ్రీగుండిచా (రథ యాత్ర) నాడు ఉదయం వన జాగరణ విధానం ప్రకారం రథ ప్రతిష్ట ముగించి రథాలు లాగేందుకు సిద్ధం చేయడం ఆనవాయితీ.

క్లుప్తంగా

ఇద్దరు జూదరుల అరెస్టు

టెక్కలి రూరల్: మండలంలోని భగవాన్‌పురం సమీపంలో పేకాట ఆడుతున్నరనే సమాచారం మేరకు ఆదివారం టెక్కలి ఎస్ఐ రామకృష్ణ తన బృదంతో వెళ్లి పేకాట శిబిరంపై దాడిచేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.73,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'రమణీయం' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న ఉపనిషన్మందిర ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఉపనిషన్మందిరంలో డాక్టర్ ఎం.వి.రమణారావు రచించిన 'రమణీయం' పుస్తకావిష్కరణ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రవచనకర్త డాక్టర్ నిష్ఠల నరసింహామూర్తి మాట్లాడుతూ షట్పది స్తోత్రం ప్రముఖ్యతను వివరించారు. అనంతరం ఉపనిషన్మందిరం పాత కార్యవర్గాన్నే కొనసాగిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆసక్తి ఉన్న కొత్తసభ్యులను అవసరమైతే చేర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పి.పతంజలిశాస్త్రి, మందుల మోహనరావు, సనపల నారాయణమూర్తి, ఎస్ఎస్ఎస్ స్వామి, చాగంటి బాపయ్య పంతులు, సీహెచ్ నిర్మల, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న పైడి శ్రీనివాసరావు

జి.సిగడాం: మండలంలోని మెట్టవలసలో ఈ నెల 21న వీధి కుక్కల దాడిలో పైల సాద్వికశ్రీ మృతి చెందడంతో చిన్నారి తల్లిదండ్రులు పైల రాంబాబు, రామలక్ష్మి దంపతులకు రణస్థలం మండల వ్యవసాయశాఖ సలహామండలి చైర్మన్ పైడి శ్రీనివాసరావు ఆదివారం రూ.10 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కామోజుల ఆరుద్ర సీతారాం, ఎంపీటీసీ సభ్యులు బెవర జగన్నాథం, బాలబొమ్మ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు పరిహారం చెల్లించాలి



బైక్ ర్యాలీ చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, నిర్వాసితులు

కొత్తూరు : వంశధార ప్రాజెక్టు నిర్వాసితులకు అదనపు పరిహారం పూర్తి స్థాయిలో చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగరావు సింహాచలం డిమాండ్ చేశారు. మండలంలోని మెట్టూరు బిట్-1, 2, 3 ఆర్ఆర్ కాలనీల్లో నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని కోరారు. అదనపు పరిహారాలు కొంత మందికి చెల్లించి మిగిలిన వారికి చెల్లించకపోవడం దారుణమన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్, మెట్టూరు బిట్-3 ఆర్ఆర్ కాలనీ సర్పంచ్ కె.శ్రీనివాసరావు, తవుడు, షణ్ముఖరావు, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉషూ పోటీల్లో సిక్కోలు హవా

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి ఉషూ పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు సత్తాచాటారు. ఇటీవల గుంటూరు జిల్లా కార్తికేయ డిఫెన్స్ అకాడమీ వేదికగా జరిగిన 9వ ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల ఉషూ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ముద్దాడ శిరీష (65 కేజీల విభాగం), భైరి ధనుంజయ్ (56 కేజీల విభాగం) బంగారు పతకాలు సాధించారు. పూణే వేదికగా మే 9 నుంచి 13వ తేదీ వరకు జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. సానివాడ గ్రామానికి చెందిన శిరీష డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతుంది. పొన్నాడ గ్రామానికి చెందిన ధనుంజయ్ బీపీఈడీ చదువుతున్నాడు. వీరికి కోచ్ మేనేజర్లగా రెడ్డి శివకుమార్, తారకరామ వ్యవహరించారు. క్రీడాకారులు రాణింపు పట్ల జిల్లా ఉషూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్, తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొమర భాస్కర్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, డీఎస్ఏ సీఈఓ బీవీ ప్రసాదరావు, పీఈటీ సంఘ నాయకుడు ఎం.వి.రమణ హర్షం వ్యక్తంచేశారు.

బీఎస్ఎఫ్ క్యాంప్ ఏర్పాటు



నూతన క్యాంప్ ప్రారంభిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి ఒడిశా- ఛత్తీష్‌ఘడ్ సరిహద్దుల్లో ఉన్న తులసి పాహడ్‌లో బీఎస్ఎఫ్ రెండో బెటాలియన్ అధికారులు నూతన క్యాంప్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. సరిహద్దుల్లో మావోయిస్టుల అలజడి ఉంటుండడంతో వారిని అరికట్టేందుకు క్యాంప్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రాంతానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఇప్పుడు అభివృద్ధి పనులు జరుగుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. క్యాంపు ప్రారంభానికి వచ్చిన గిరిజనులకు అధికారులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే దుస్తులు, నిత్యావసర సరుకులు, స్కూల్ పిల్లలకు బ్యాగ్‌లు, యువతకు క్రీడా సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి రెండో బెటాలియన్ బీఎస్ఎఫ్ అధికారి సైలేంద్ర కుమార్ సిన్హా, మల్కన్‌గిరి ఎస్పీ నీతిష్ వాద్వనీ, బీఎస్ఎఫ్ కామాండెంట్ మానోజ్ కర్కి, టెమురపల్లి సర్పంచ్ తుమేష్ సోమారో తదితరులు పాల్గొన్నారు.



క్యాంప్ వద్ద జాతీయ జెండా ఎగురవేస్తున్న బీఎస్ఎఫ్ జవాన్లు



మహిళలకు దుస్తులు అందజేస్తున్న దృశ్యం

నేత్రపర్వం.. చందనోత్సవం



భువనేశ్వర్: శ్రీక్షేత్రంలో చందన యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



బరంపురం: ప్రత్యేక పుష్పాలంకరణలో స్వామివారు



బరంపురం: ప్రత్యేక పూజలు అందుకుంటున్న లక్ష్మీ నరసింహస్వామి

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని క్షేత్రంలో చందన యాత్ర ప్రారంభమైంది. అక్షయ తృతీయ పురస్కరించుకుని ఏటా ఈ యాత్ర ఆరంభం అవుతుంది. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవీ సమేతంగా రామ, కృష్ణ, మదన మోహనులు పంచ పాండవ సహితంగా నరేంద్ర కొలనుకు ఊరేగింపుగా పల్లకిలో తరలి వెళ్లారు. కొలను ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉత్సవ వేదికపై ప్రత్యేక ఉపచారాలు చేపట్టిన తర్వాత నౌకా విహారం నిర్వహించారు. నంద, భద్ర నావల్లో దేవతల ఉత్సవమూర్తులు జల క్రీడల్లో పాల్గొన్నాయి. సాధారణ భక్తజనం ఈ విన్యాసాలను కనులారా ప్రత్యక్షంగా తిలకించి తరించారు. రెండు విడతలుగా జరిగే చందన యాత్ర తొలి దశ వెలుపల చందన యాత్ర. అక్షయ తృతీయ నుంచి 21 రోజులపాటు నిరవధికంగా కొనసాగుతుంది. మలి దశ అంతర్ చందన యాత్ర. తదుపరి 21 రోజులు శ్రీ మందిరం ప్రాంగణంలో నిర్వహిస్తారు.

బరంపురం: అక్షయ తృతీయ పర్వదినం పురస్కరించుకొని నగర శివారులోని సుకుండా చందన్ పర్వతాలపై కొలువైన లక్ష్మీనరసింస్వామి ఆలయంలో ఆదివారం చందనోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాద ఏర్పాట్లు చేశారు.

రాయగడ: జిల్లా కేంద్రానికి సమీపంలోని జేకేపూర్‌లో ఉన్న వేంకటేశ్వర మందిరంలో అక్షయ తృతీయ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చందనంతో స్వామివారిని అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.



రాయగడ: చందనం అలంకరణలో వేంకటేశ్వరుడు



బరంపురం: లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయంలో బారులుతీరిన భక్తులు

పంటలు పండాలి..
సిరులు కురవాలి

● ఘనంగా అక్షయ తృతీయ వేడుకలు



బరంపురం: పెద్ద బజార్‌లో బంగారు ఆభరణాలు కొంటున్న మహిళలు



బరంపురం: దిగపండి బ్లాక్ బంగినబడి గ్రామంలో భూమికి పూజలు చేస్తున్న దృశ్యం



బరంపురం: చిన్న బజార్‌లో ఆభరణాలు కొంటున్న వినియోగదారులు



బరంపురం: నాగలితో పొలం దున్నతున్న రైతులు



రాయగడ: విత్తనాలు వేస్తున్న రైతులు

అక్షయ తృతీయ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా బంగారం దుకాణాలు కొనుగోలుదారులతో ఆదివారం కిటకిటలాడాయి. బంగారం కొంటే ఇంటికి లక్ష్మీదేవి వస్తుందని ఆచారం ఉంది. దీంతో మహిళలు అధిక సంఖ్యలో బంగారం కొనుగోలు చేశారు. అలాగే రైతులు ఖరీఫ్ సాగును ప్రారంభించారు. ముందుగా భూమిపూజ నిర్వహించి, అనంతరం దుక్కిచేసి విత్తనాలు జల్లారు. - సాక్షి నెట్‌వర్క్



రాయగడ: పూజలు చేస్తున్న సబ్ కలెక్టర్ భీమసేన్ తదితరులు



పర్లాకిమిడి: పర్సంబ గ్రామంలో దుక్కి చేస్తున్న సబ్ కలెక్టర్ అలోక్ ప్రధాన్



జయపురం: బంగారు దుకాణాలలో కిక్కిరిసిన కొనుగోలుదారులు

ఐక్యతతోనే తూర్పుకాపుల అభివృద్ధి



ఐక్య నినాదం చేస్తున్న తూర్పుకాపులు

శ్రీకాకుళం (పీఎస్‌కాలనీ): జిల్లాలో అధికంగా తూర్పుకాపులున్నప్పటికి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటులోనే ఉన్నామని, అందరూ ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందని ఆలిండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చంద్రమోహన్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో ఆలిండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయస్థాయి తూర్పుకాపు సంగ్రామ మహాసభ ఆదివారం ఓ ప్రవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో తూర్పుకాపులను అణచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం తూర్పుకాపుల్లో ఉన్నత పదవులు పొందినవారిని సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు, పంచాయతీరాజ్ చాంబర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనేపు రామకృష్ణ, శ్రీకాకుళం లైన్స్ క్లబ్ అధ్యక్షుడు, ప్రభుత్వ న్యాయవాది వాన కృష్ణచంద్, శ్రీకాకుళం జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, అరసవల్లి సూర్యనారాయణ దేవస్థానం బోర్డు సభ్యుడు లుకలాపు గోవిందరావు, సంఘ కో-కన్వీనర్ కద్దాల శ్యామసుందరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పతివాడ గిరీశ్వరరావు, తాటిరాజు రాజారావు, కురిటి మాధవ నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బబ్బాది పకీర్‌నాయుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరిమజ్జి మల్లేశ్వరరావు, మహంతి రమణారావు, కలిశెట్టి అప్పలనాయుడు, సురవరపు నాగేశ్వరరావు, వడిశ హరిప్రసాద్, హారికా ప్రసాద్, నందివాడ గోవిందరావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు కోయిలాపు శ్రీనివాసరావు, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఆకుల అప్పలసూరి నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి సలాన చిరంజీవి, మత్స బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎకువూరులో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

సోంపేట: మండలంలోని ఎకువూరు గ్రామంలో పెద్దమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాల సందర్భంగా మే 3, 4 తేదీల్లో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.10,116, రూ.7,116, రూ.5116, రూ.3116, ట్రోఫీలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెలాఖరులోగా 8247728993, 7207544787 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రథాల తయారీకి అంకురార్పణ



జయపురం: రథం తయారీ కలపకు పూజలు చేస్తున్న పూజారులు



బరంపురం: కోర్టు పేటలో ప్రత్యేక పూజలు అందుకుంటున్న జగన్నాథ్ త్రిమూర్తులు



బరంపురం: రథ నిర్మాణానికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: ప్రత్యేక అలంకరణలో శ్రీజగన్నాథుడు

బరంపురం: అక్షయ తృతీయ సందర్భంగా స్థానిక గుసానినువాగంలోని జగన్నాథ స్వామి ఆలయ ప్రాగణంలో రథయాత్ర కోసం మూడు కొత్త రథాల తయారీకి ఆదివారం అంకురార్పణ పూజలు చేశారు. అలాగే స్థానిక కోర్టుపేట, ఉత్కళ ఆశ్రమ రోడ్, కస్పా వీధి, బాలింకేశ్వర్ పేట, బాపుర్ బజార్, పాతాశేశ్వర్ రోడ్, బెజ్జిపూర్ తదితర ప్రాంతాల్లోని జగన్నాథ స్వామివారి ఆలయాల్లో కొత్త రథాలకు పూజలు చేశారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జయపురం: స్థానిక రఘునాథ్ మందిర ప్రాంగణంలో జగన్నాథ రథయాత్రకు సంబంధించిన రథ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఉదయం 7 గంటలకు మందిర ప్రాంగణంలో రథం కలపకు జగన్నాథ మందిర పూజారులు డొంబురు దొర పండ, మల్లు త్రిపాఠీలు పూజలు నిర్వహించారు. రథ నిర్మాణం పనులు డొంబురు మహారాణ ప్రారంభించారు. కార్యక్రమంలో జయపురం దేవదాయ ధర్మాదాయ విభాగ కార్యదర్శి కృష్ణ చందర దాస్ పాల్గొన్నారు.

పర్లాకిమిడి: స్థానిక జగన్నాథ మందిరంలో రథయాత్రకు అవసరమయ్యే రథాల దుంగలకు కమిటీ సభ్యులు, రథాలు తయారు చేసే సుదర్శన మహారాణా, సేవాయత్‌లు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. జగన్నాథస్వామి, బలరామ, సుభద్రలకు ప్రత్యేక అలంకరణలు చేశారు.



బరంపురం: కోర్టుపేట జగన్నాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు



పర్లాకిమిడి: రథాల పనిముట్లు, కలపకు పూజలు చేస్తున్న రథయాత్ర కమిటీ సభ్యులు

క్లుప్తంగా

వావ్..ఎంత పెద్ద గుత్తో..!



కాయలతో వేలాడుతున్న మామిడి గుత్తి

నెల్లిమర్ల: ఎక్కడైనా మామిడి గుత్తికి ఐదో, పదో మామిడి కాయలు ఉంటాయి. అయితే ఈ గుత్తిలో మాత్రం ఏకంగా 22 కాయలున్నాయి. నెల్లిమర్ల పట్టణంలోని మండల పరిషత్ ప్రాంగణంలో ఉన్న ఓ మామిడి చెట్టుకు ఈ గుత్తి వేలాడుతూ సాక్షి కెమెరాకు చిక్కింది. ఇంత పెద్ద మామిడి గుత్తిని చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు.

సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుల నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

విజయనగరం: జిల్లా వ్యాప్తంగా ఉన్న సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుల జిల్లా కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. విజయనగరంలో గల ఏపీ ఎన్జీవో అసోసియేషన్ భవనంలో జరిగిన ఎన్నిక ప్రక్రియను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫారుక్ జాన్, ఉపాధ్యక్షుడు బి.శంకరరావులు పర్యవేక్షించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా ఆర్.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా వి.మనోహర్, అసోసియేట్ అధ్యక్షుడిగా బి.తిరుపతిరావు, కోశాధికారిగా ఎన్.మధువర్ధన్‌లు ఎన్నికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా ఆర్.సంగీత్, వై.సురేష్, బి.ఈశ్వరరావు, మహిళా కార్యదర్శులుగా ఎ.జానకి, గౌతమిలతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు చిన్నారావు

సీతంపేట: మండలంలోని మెట్టుగూడ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన చింతాడకు చెందిన సవర చిన్నారావు(27) రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై నీలకంఠరావు ఆదివారం తెలిపారు. మృతదేహానికి పాలకొండ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు. మృతుడికి భార్య గీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మేస్త్రీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకువస్తున్న ఇంటి యజమానిని కోల్పోవడంతో భార్యాపిల్లలు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న అప్పలస్వామి

వీరఘట్టం: మండలంలోని సంత-నర్సిపురం గ్రామానికి చెందిన నారాయణపురం అప్పలస్వామి (50) అప్పుల బాధతో ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కిశోర్‌వర్మ తెలిపారు. గ్రామంలో కొందరికి డబ్బులు బాకీ ఉండడంతో భూమి అమ్మేసి అప్పులు తీర్చేద్దామని అనుకున్నాడు. అయితే కుటుంబసభ్యులు భూమి అమ్మేందుకు ఒప్పుకోకపోవడంతో మనస్తాపం చెంది తన టేకు తోటలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య గౌరమ్మ, కుమారుడు ఉపేంద్ర ఉన్నారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

గిరిజన ప్రాంత వాసులూ.. అప్రమత్తం

బొండపల్లి: గిరిజన ప్రాంతంలోని ఆవుల మందపై పట్టపగలు పులి దాడి చేసి ఆవును చంపివేసినందున గిరిజన ప్రాంత వాసులంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఎ.వేదవతి, కొత్త పాలెం ఫారెస్టు బీట్ ఆఫసర్ కె.వి.జగదీష్ అయా గ్రామాల గిరిజనులకు సూచించారు. మండలంలోని కొత్త పాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని చీడిపాలెం గ్రామంలో ఆవును పులి చంపివేసిన ప్రాంతాన్ని క్షేత్ర స్థాయిలో ఆదివారం వారు పరిశీలించారు. పులి దాడిలో మృతి చెందిన ఆవుకు శవ పంచనామా నిర్వహించారు. అనంతరం అయా గ్రామాలకు చెందిన ప్రజలతో నేరుగా మాట్లాడడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులి కదలికలపై నిఘా కెమెరాలను అటవీ ప్రాంతంలో పలు చోట్ల ఏర్పాటు చేసినట్లు చెప్పారు.కార్యక్రమంలో టైగర్ ట్రాకర్ అమర్, సహాయకులు చేతన్, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గర్జిస్తే.. గండమే...



- ప్రజల ప్రాణాలను బలిగొంటున్న పిడుగులు
- పిడుగుల సమాచారం ముందుగానే చెబుతున్న వాతావరణ శాఖ
- అప్రమత్తంగా ఉంటే సరే..
- గతేడాది ఉమ్మడి జిల్లాలో పిడుగు పాటుకు 15 మంది మృతి
- ఈ ఏడాది ఇప్పటికే ముగ్గురి మృతి.. పలువురికి గాయాలు

వీరఘట్టం:

వేసవి కాలంలో కురిసే వర్షాలు ప్రమాదకరంగా మారాయి. ఈ కాలంలో వర్షం వచ్చే సమయంలో ఎక్కువగా ఉరుములు ఉరుముతాయి.. ఉరుములతో పాటు పిడుగులు పడుతుంటాయి. పిడుగు పాటు వల్ల భీకర ధ్వని, విపరీతమైన వెలుతురుతో పాటు విద్యుత్ విడుదలవుతుంది. పిడుగుపాటు బారిన పడి గ్రామీణ ప్రాంతాల్లో పొలాల్లో తిరిగాడే పశువుల కాపర్లు, రైతులు, ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఒక్కోసారి చెట్లు, మూగజీవాలు కూడా పిడుగుపాటుకు చనిపోతున్నాయి. అందుకే వాతావరణ శాఖ పిడుగులు పడే ప్రాంతాల సమాచారాన్ని ముందస్తుగానే తెలియజేస్తోంది. ఈ ఆపద నుంచి గట్టెక్కాలంటే అప్రమత్తతే మందంటున్నారు నిపుణులు. పిడుగు ఎలా పడుతుంది. ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర విషయా నిపుణుల మాటల్లోనే...

- గత నెల మార్చి 21న కురుపాంలో ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసి తిరిగి ఇంటికి వెళ్తున్న ఓ అమ్మాయిపై పిడుగు పడడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది.
- మార్చి 22న మెంటాడ మండలం పెదమేడపల్లి గ్రామంలో పిడుగుపడి ఎనిమిది గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డాయి.
- మార్చి 25న విజయనగరం జిల్లా గుర్ల మండలం కొండగంట్రేడులో పొలంలో మొక్కజొన్న తీస్తుండగా పక్కనే పిడుగు పడడంతో నలుగురు మహిళలకు గాయాలయ్యాయి.
- మార్చి 27న జియ్యమ్మవలస మండలం బిత్రపాడు గ్రామానికి చెందిన వన్నెల సింహాచలం పశువులను మేతకు తీసుకువెళ్లి తిరిగి వస్తుండడగా అతనిపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- ఈ నెల 1న వంగర మండలం సంగాం గ్రామంలో పిడుగు పాటుకు ముగ్గురు మహిళలు అస్వస్థతకు గురయ్యారు.
- తాజాగా శనివారం(ఈ నెల 22) ఎస్.కోట మండలంలో కూలీ పనులకు వెళ్లిన బొంగరాల అప్పారావుపై పిడుగుపడి అక్కడికక్కడే చనిపోయాడు. ఇలా ప్రతీ ఏటా పదుల సంఖ్యలో పిడుగుపాటుకు జనం మృత్యువాత పడుతున్నారు. గతేడాది ఉమ్మడి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 15 మంది పిడుగుపాటుకు బలైపోయారు. ఈ ఏడాది ఇంత వరకు ముగ్గురు పిడుగుపాటుకు చనిపోయారు.

పిడుగంటే అత్యధిక విద్యుత్ ప్రవాహం



మెరుపుల ద్వారా ఏర్పడే అత్యధిక విద్యుత్ ప్రవాహమే పిడుగు. ఒక్కోసారి విద్యుదావేశం పేరుకుపోయిన మేఘాలకు సమీపంలో వ్యతిరేక విద్యుదావేశం మేఘాలు ఉన్నప్పుడు స్థిరంగా విద్యుత్ భూమి వైపు ప్రవహిస్తుంది. ఒక మిల్లీ సెకను కాలంలో మెరుపులతో కూడిన పిడుగు 20 వేల ఆంపియర్ల విద్యుత్ ప్రవాహాన్ని విడుదల చేస్తుంది. అప్పుడు ఏర్పడే విద్యుత్ క్షేత్ర తీవ్రత మీటరుకు 2లక్షల ఓల్టులతో సమానం. మెరుపులు భూమి మీద పడినప్పుడు వస్తువులను బట్టి నష్ట తీవ్రత ఉంటుంది. పిడుగులు ఎక్కువగా క్యుములో నింబస్ మేఘాల వల్ల ఏర్పడతాయి. మేఘాల్లో మంచు, నీరు ఏర్పడినప్పుడు స్ట్రాటోస్పియర్‌లో చల్లని వాతావరణంలో విరుద్ధ విద్యుదావేశాలు ఏర్పడి స్థిర విద్యుత్ ప్రవాహంగా మారతాయి. ఆ సమయంలో పిడుగులు ఏర్పడతాయి.

– **పొట్నూరు రాజీవ్**, ఇస్రో శాస్త్రవేత్త

ప్రథమ చికిత్స చేయాలి



పిడుగు పాటుకు గురైన వ్యక్తిని వెంటనే పొడి ప్రదేశంలో తిన్నగా పడుకోబెట్టాలి. తడి బట్టలు తీసివేయాలి. తలను ఒక పక్కకు తిప్పాలి. రెండు కాళ్లు ఒక అడుగు పైకి ఎత్తాలి. గాలి తగిలే ప్రదేశంలోఉంచి, అవసరమైతే నోటి ద్వారా గాలి ఊది ప్రథమ చికిత్స చేయాలి. వెంటనే దగ్గరలో ఉన్న పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందజేయాలి.

– **డాక్టర్ జె.రవీంద్రకుమార్**, చిన్నపిల్లల వైద్య నిపుణులు, ఏరియా ఆస్పత్రి, పాలకొండ

ఏం చేయకూడదంటే..



- వర్షం కురిసేటప్పుడు చెట్ల కింద నిలబడకూడదు.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తే రైతులు పొలాల్లో ఉండకూడదు.
- మెరుపు కనిపించిన తర్వాత 30 సెకన్లలో లేదా అంతకన్నా తక్కువ సమయంలో ఉరుము వినిపిస్తే మనకు 10 కిలోమీటర్ల దూరంలోపు పిడుగు పడే అవకాశం ఉంది.
- మెరుపు కనబడిన తర్వాత 30 నిమిషాల పాటు బయటకు వెళ్లే ప్రయత్నం చేయరాదు.
- గొడుగులపై లోహపు బోల్టులు, చేతుల్లో సెల్‌ఫోనులు లేకుండా చూసుకోవాలి. సెల్‌ఫోన్ ఉంటే స్విచ్ ఆఫ్ చేయాలి.
- ఒక వేళ ఇవి ఉంటే రేడియేషన్ తరంగాలకు గురై ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది.
- వర్షం పడే సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో ఉండకూడదు. ఆ సమయంలో చెప్పులు లేకుండా బయటకు వెళ్లకూడదు.
- గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు మెరుపులు, ఉరుములకు భయాందోళనకు గురవుతారు. వారికి అలాంటివి కనబడకుండా, వినపడకుండా జాగ్రత్త పడాలి.

– **డాక్టర్ జి.ప్రదీప్‌కుమార్**, మెడికల్ ఆఫీసర్, వీరఘట్టం

లైట్నింగ్ కండక్టర్‌తో సేఫ్



పిడుగు పాటు నుంచి తప్పించుకొనేందుకు ఎత్తైన ప్రదేశం నుంచి నేరుగా భూమిలో నేరుగా లైట్నింగ్ కండక్టర్ ఏర్పాటు చేయాలి. పిడుగు పాటుకు లైట్నింగ్ కండక్టర్ ఏర్పాటు చేసుకోవాలనే విషయాన్ని 1749లో బెంజిమెన్ ఫ్రాంక్లిన్ కనుగొన్నాడు. దీనిని ఏర్పాటు చేయడం వల్ల పిడుగులో ఉన్న విదుద్యావేశాన్ని భూమి తనలోకి ఆక్షరించుకుంటుంది. ఎత్తైన టవర్లు ఏర్పాటు చేసినప్పుడు ఇలాంటి జాగ్రత్తలు పాటించడం వల్ల పిడుగుపాటు నుంచి తప్పించుకోవచ్చు.

– **జి.లక్ష్మణరావు**, సైన్సు ఉపాధ్యాయుడు, బాలుర ఉన్నత పాఠశాల, వీరఘట్టం

అంకిత భావంతో పనిచేయాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథం



తాడికొండ పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథం

గుమ్మలక్ష్మీపురం: వైద్య ఆరోగ్య సిబ్బంది విధుల నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తున్నారన్న నమ్మకం కలిగితే రోగులు ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందుతారని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ బి.జగన్నాథం అన్నారు. మండలంలోని తాడికొండ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. మందుల నిల్వలు, రోగ నిరోధక టీకాలు, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట వైద్యాధికారి ఎం.బుద్ధేశ్వరరావు, జిల్లా కంటి వెలుగు నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తదితరులున్నారు.

కీసరలో ఏనుగుల విధ్వంసం



సోలార్ వ్యవసాయ పంపును ధ్వంసం చేసిన ఏనుగులు

భామిని: మండలంలోని తాలాడ ఐలమ్మ తోటలో తిష్ట వేసిన నాలుగు ఏనుగుల గుంపు ఆదివారం విధ్వంసం సృష్టించాయి. కీసరలోని పంట పొలాలను ధ్వంసం చేశాయి. అదే గ్రామానికి చెందిన వట్టి జాన్‌కు చెందిన సోలార్ వ్యవసాయ బోరును ధ్వంసం చేశాయి. సోలార్ ప్లేట్లు ధ్వంసం చేసి, పైపులు పీకివేశాయి. చుట్టూ ఉన్న మొక్కజొన్న, కూరగాయలు, ఇతర పంటలను తినేశాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అందరూ ఆదరించేలా 'ఆనందతీరం'



కాళికాదేవి అమ్మవారికి స్క్రిప్ట్ సమర్పించి పూజలు చేస్తున్న దర్శకుడు రాంబాబు

విజయనగరం టౌన్: ప్రతి ఒక్కరూ ఆదరించే విధంగా తమ చిత్రం ఆనందతీరం ఉంటుందని విజయనగరం జిల్లా పినవేమలికి చెందిన ఔత్సాహిక దర్శకుడు బీటెక్ రాంబాబు పేర్కొన్నారు. స్థానిక దాసన్నపేట కాళికాదేవి ఆలయంలో తమ నూతన సినిమా స్క్రిప్ట్‌ను అమ్మవారికి సమర్పించి తొలి పూజలు ఆదివారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ కొన్నేళ్లుగా సినీ రంగంలో వివిధ విభాగా ల్లో అనుభవం సంపాదించి స్వయంగా తెలు గు సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. లక్ష్మీ బ్యానర్‌పై జాన్ రమేష్ హీరోగా, కన్నడ హీరోయిన్ శాంతిక హీరోయిన్‌గా నటిస్తున్నారన్నా రు. ఉత్తరాంధ్రతో పాటూ కేరళలో షూటింగ్ ఉంటుందన్నారు. నిర్మాతగా కాపుశైలజ వ్యవహరిస్తున్నారన్నారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్ సన్యాసిరావు, లక్ష్మి, ఆదిబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ పంచాయతీగా రామభద్రపురం

రామభద్రపురం: రాష్ట్ర స్థాయి ఉత్తమ పంచాయతీగా రామభద్రపురం మేజర్ పంచాయతీ ఎంపికైంది. రాష్ట్ర స్థాయిలో 2021 – 22 ఆర్థిక సంవత్సరంలో సామాజిక భద్రత కలిగిన గ్రామ పంచాయతీగా ఎంపికైంది. పేదరికం, మెరుగైన జీవనోపాధుల విభాగంలో మండల స్థాయిలో రొంపల్లి ఉత్తమ పంచాయతీగా ఎంపికైనట్టు ఎంపీడీఓ రమామణి తెలిపారు. జాతీయ పంచాయతీ దినోత్సవం సందర్భంగా విజయవాడలో రామభద్రపురం పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులు అమరావతిలో, రొంపల్లి పంచాయతీ సర్పంచ్ కార్యదర్శులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం అవార్డులు అందుకోనున్నట్లు తెలిపారు.

64 ఏళ్ల తరువాత అసిరితల్లి పండుగ

- ముమ్మరంగా ఏర్పాట్లు
- నేటి నుంచి 9 రోజుల పాటు నిర్వహణ
- పలు సాంసృతిక కార్యక్రమాలు ఏర్పాటు



రంగులతో అలంకరించిన అమ్మవారి ఆలయం

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామ దేవత అసిరితల్లి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 64ఏళ్ల కిందట చేపట్టిన అమ్మవారి పెద్ద పండుగ ఈ ఏడాది నిర్వహించేందుకు గ్రామస్తులు నిర్ణయించారు. ఈ మేరకు గత నాలుగు నెలలుగా ఏర్పాట్లు చేపట్టి అన్ని వర్గాల అనుమతితో పండుగ నిర్వహణకు సిద్ధం చేశారు.

నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు

సోమవారం నుంచి తొమ్మిది రోజుల పాటు అమ్మవారి పండుగ చేపట్టనున్నారు. ఇప్పటికే గ్రామ పొలిమేరల్లో ఉన్న అసిరితల్లి ఆలయానికి రంగులు వేసి అలంకరించారు. ఈ తొమ్మిది రోజులు రాత్రి సమయాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాటు చేశారు. ప్రతి రోజు అమ్మవారి పాలజంగిడి దమ్మలవారి ఆధ్వర్యంలో గ్రామంలో ఊరేగింపు ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

గ్రామంలో 64 ఏళ్ల తరువాత నిర్వహిస్తున్న పండుగ కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఆ మేరకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. గ్రామం నుంచి ఆలయం వరకు రహదారి నిర్మాణం పూర్తి చేశారు. గ్రామం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. చివరి రోజు మే 2న అమ్మవారి తిరువీధి ఉత్సవం కోసం పలు రకాల శక్తి వేషాలు, తప్పెటగుళ్లు, మేళాలు, తదితర ఏర్పాట్లు చేశారు.

3న గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణానికి

సీఎం శంకుస్థాపన

- ముఖ్యమంత్రి సభాస్థలి ఖరారు
- ఏర్పాట్లు ముమ్మరం చేసిన జిల్లా యంత్రాంగం
- ఏర్పాట్లు పరిశీలించిన సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం
- పరిశీలనలో పాల్గొన్న జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ, కలెక్టర్, ఎస్పీ



సభా వేదిక పరిసర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం తదితరులు

భోగాపురం: భోగాపురంలో నిర్మించనున్న అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణానికి వచ్చే నెల మే 3వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహ న్‌రెడ్డి చేతులమీదుగా జరగనున్న శంకుస్థాపనకు, అనంతరం నిర్వహించే బహిరంగ సభకు సభాస్థలి ప్రదేశం ఖరారైంది. భోగాపురం మండలం ఎ.రావివలస, సవరవిల్లి గ్రామాల వద్ద విమానాశ్రయ నిర్మాణానికి సీఎం జగన్ శంకుస్థాపన చేయనున్నా రు. అనంతరం అక్కడ బహిరంగ సభను నిర్వహిస్తారు. ఇక్కడి నుంచే రూ.194 కోట్లతో తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పెండింగ్ పనులకు, చింతపల్లి జెట్టీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభ స్థలాన్ని సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక పాటిల్ ఆదివారం ఉదయం పరిశీలించారు. సభా వేదిక, వీఐపీ గ్యాలరీ, పైలాన్, వాహ నాలకు పార్కింగ్ తదితర అంశాలపై చర్చించి స్థలాలను ఖరారు చేశారు.

వ్యాక్సిన్‌తో చిన్నారులకు రక్షణ

చిన్నారులకు సకాలంలో అవసరమైన వ్యాక్సిన్లు వేయడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉంచేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టింది. ఇందుకుగాను ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన టీకాలను అందుబాటులో ఉంచింది. వైద్య సిబ్బంది ద్వారా చిన్నారుల తల్లిదండ్రులను అప్రమత్తం చేయడం ద్వారా సకాలంలో టీకాలు వేస్తూ వారి రక్షణకు తగు ప్రాధాన్యం ఇస్తుంది.

- అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వ్యాక్సిన్లు
- కొరత లేకుండా సరఫరా చేస్తున్న ప్రభుత్వం
- ప్రతీ బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్ డే
- వంద శాతం వ్యాక్సినేషన్‌కు ఏటా చర్యలు



చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడేందుకు వ్యాక్సినేషన్ కార్యక్రమం పార్వతీపురం మన్యం జిల్లాలో పకడ్బందీగా సాగుతోంది. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి పెరిగి పెద్దయిన పిల్లల వరకు వారికి అవసరమైన టీకాలను ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తోంది. ఫలితంగా పోలియో, ధనుర్వాతం, క్షయ, కోరింత దగ్గు, హెపటైటిస్-బీ, చికెన్ ఫాక్స్, గవద బిళ్లలు వంటి వ్యాధుల నుంచి చిన్నారులకు రక్షణ కల్పిస్తోంది. ఈ వ్యాక్సిన్ల(టీకాలు) ప్రయోజనాలను అధికారులు, వైద్య సిబ్బంది ప్రజల్లోకి తీసుకెళ్లటంతో వ్యాక్సినేషన్ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ప్రతీ ఒక్కరూ వారి పిల్లలకు టీకాలు వేయించడానికి ముందుకు వస్తున్నారు. దీంతో ప్రతీ సంవత్సరం వంద శాతం వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతోంది.

పిల్లలకు వేసే టీకాలు ఇలా..

- శిశువు జన్మించిన సమయంలో బీసీజీ, ఓపీవీ జీరో మోతాదు, హెపటైటిస్ – బీ
- 6 వారాలకు ఓపీవీ – 1, పెంటావాలెంట్ – 1, రోటా – 1, ఎఫ్ఎల్‌పీవీ – 1, పీసీవీ – 1
- 10 వారాలకు ఓపీవీ – 2, పెంటావాలెంట్ – 2, రోటా – 2
- 14 వారాలకు ఓపీవీ – 3, పెంటావాలెంట్ – 3, రోటా – 3, ఎఫ్ఎల్‌పీవీ – 2, పీసీవీ – 2
- 9 నెలలకు మీజిల్స్ – 1/ ఎంఆర్ –1, విటమిన్ – ఎ, జేఈ – 1, పీసీవీ – బీ
- 16 నుంచి 24 నెలల్లో డీపీటీ మొదటి బూస్టర్ డోసు, ఓపీవీ బూస్టర్ డోసు, మీజిల్స్–2/ఎంఆర్–2, జేఈ–2
- 5 నుంచి 6 సంవత్సరాలకు టీపీటీ రెండవ బూస్టర్ మోతాదు
- 10, 16వ సంవత్సరంలో టీడీ వేస్తారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో వ్యాక్సినేషన్ వివరాలు

వ్యాక్సిన్	వేయించుకున్న చిన్నారులు
బీసీజీ	14,619
ఓపీవీ జీరో డోస్	14,484
హెపటైటిస్–బీ జీరో డోస్	14,873
ఓపీవీ థర్డ్ డోస్	15,899
పెంటావాలెంట్ థర్డ్ డోస్	15,941
రోటా వైరస్ వ్యాక్సిన్	15,513
మీజిల్స్/ఎంఆర్	15,035
విటమిన్–ఎ	14,826



దేరువలసలో చిన్నారి టీకా కార్డును పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ తెల్లి జగన్మోహనరావు

ప్రతీ బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్ డే

పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో పీహెచ్‌సీలు 37, అర్బన్ హెల్త్ సెంటర్లు 5, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు – 282, సీహెచ్‌సీలు 3 ఉన్నాయి. ఆయా ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీ బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్ డే నిర్వహిస్తున్నారు. ఏఎస్ఎం/ఆరోగ్య కార్యకర్తలు గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి గర్భిణులు, చిన్న పిల్లలకు టీకాల కోసం ఈ కేంద్రాలకు తీసుకెళ్తుంటారు. ఈ మేరకు ప్రతీ ఆరోగ్య కేంద్రానికి అవసరమైన వ్యాక్సిన్లను జిల్లా ఇమ్యునైజేషన్ కేంద్రం నుంచి అధికారులు చేరవేస్తున్నారు. ఆయా కేంద్రాల్లో వ్యాక్సిన్లు నిల్వ ఉంచేందుకు వీలుగా అవసరమైన ఫ్రిజ్‌లు కూడా ఏర్పాటు చేశారు. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి పిల్లల వరకు, గర్భిణులకు వ్యాక్సిన్లు నిర్దేశించిన సమయాల వారీగా వ్యాక్సిన్లు వేస్తున్నారు.

సకాలంలో టీకాలు వేయించాలి

చిన్నారులు వ్యాధుల బారిన పడకుండా సకాలంలో వ్యాక్సిన్‌లు వేయించాలి. అతి ఖరీదైన పీసీవీ, ఐపీవీ, రోటావైరస్ లాంటి వ్యాక్సిన్‌లను ప్రభు త్వం ఉచితంగా అందిస్తోంది. అవసరమైన అన్ని రకాల వ్యాక్సిన్(టీకా)లు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిద్ధంగా ఉంచాం. ఏఎన్ఎంల సూచనల మేరకు ఇచ్చిన సమయానుసారంగా బుధ, శనివారాల్లో ప్రభుత్వ ఆస్పత్రులు /వెల్‌నెస్ సెంటర్ల వద్దకు తీసుకెళ్లి పిల్లలకు వ్యాక్సిన్‌లు వేయించాలి.

– **డాక్టర్ తెల్లి జగన్మోహనరావు**, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, పార్వతీపురం మన్యం